కథ

# అనామకుడు

విమానం ఎక్కడం అదే మొదటి సారి అనసూయకి. ఒక పక్క సంతోషం గానే ఉన్నా మరోపక్క భయంగా ఉంది. ఎవరన్నా హైజాకర్లు ఉంటారేమో - బాంబులు పెడ్తారేమో - విమానాన్ని కూల్చేస్తారేమో - అని.

అనసూయ ఎక్కిన విమానం మధ్యలో లండన్‌లో ఆగి, అక్కడ నుండి న్యూయార్క్ వెళ్తుంది. అంతా కలిపితే ప్రయాణం మొత్తం ఒకరోజు దాకా ఉంటుంది.

అనసూయకి అంతా కొత్తగా ఉంది. దానికితోడు ఎయిర్ హోస్టెస్లు మన దేశం వాళ్లు కారు. ఎలాగో ఓ రోజు అందులో గడపాలీ అని అనుకుంటూ-

తన పక్కన కూచున్న వాళ్ల వంక చూసింది అనసూయ. తన పక్క సీట్ ఖాళీగా ఉంది. ఆ పక్కన ఓ తెల్లవాడు కూచుని ఉన్నాడు. బ్రిటిష్ వాడయ్యుంటాడు.

బ్రిటిష్ వాళ్ళు మనకి శత్రువులే. ఐతే అది ఎప్పుడో, ఇప్పుడు వాళ్ళని చూసి భయపడాల్సింది లేదు.

ఇంతలో తన పక్కన ఖాళీగా ఉన్న సీట్లోకి ఒక గడ్డం అతను వచ్చి కూచున్నాడు. వయస్సు పాతికేళ్ళుండవచ్చు. నెత్తిమీద టోపీ ఉంది. చూడగానే ముస్లిం అని తెలిసిపోతోంది. జీవితంలో చాలా భాగం విజయవాడలో సత్యనారాయణపురంలో కాలం గడిపేసిన అనసూయ ఓ ముస్లింని అంత దగ్గరగా చూడ్డం అదే మొదటిసారి. ముస్లిం పక్కన కూచుని ప్రయాణం చెయ్యడం - అసలు కలలో కూడా ఊహించింది కాదు.

తను విన్నదాని ప్రకారం ముస్లింలు దుర్మార్గులు. వాళ్ళకి మనుషుల ప్రాణాలంటే లెక్కలేదు. తోటి మనుషుల్ని నిర్దాక్షిణ్యంగా, అతిక్రూరంగా చంపెయ్యగలరు. ప్రపంచంలోని గొడవలకీ, అల్లకల్లోలాలకీ వాళ్ళే కారణం. అలాంటి ఓ ముస్లిం పక్కన కూచుందుకు భయం వేసింది అనసూయకి. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని సమయం గడపసాగింది. కళ్ళ ముందు వరల్డ్ ట్రేడ్ సెంటర్ బిల్డింగులు రెండూ మండుతూ కుప్పకూలిపోవడం కనిపిస్తూ ఉంది.

విమానం మొదటిసారి ఎక్కిన ఉత్సాహం లేకుండా పోయింది. అమ్మాయి దగ్గరికి అమెరికా వెళ్తున్న ఆనందమే లేదు. కిటికీలోంచి బయటకి చూస్తూ కూచోవలసింది పోయి - బిక్కు బిక్కు

## ప్లీజ్ డోంట్ బ్రాండ్ మీ

మంటూ కూచుంది.

తినడానికి హోస్టెస్‌లు తీసుకు వచ్చింది తినలేక పోయింది.

విమానం ఎంత ఎత్తులో ఉందో, ఏ దేశం పైన ఎగురుతోందో, ఎటు వెళ్తోందో చూపిస్తున్న టీవీ స్క్రీన్ని చూళ్ళేకపోయింది.

పది గంటల ప్రయాణం తర్వాత లండన్ చేరింది విమానం. అందరితోపాటు తనూ దిగింది అనసూయ.

ఓ రెండు గంటలు అటూ ఇటూ తిరిగాక మళ్ళీ విమానం ఎక్కింది. తన పక్క సీట్లోని ముస్లిం అతను లండన్‌లో దిగిపోయినట్లు లేదు. ఆ సీట్లోనే కూచుని ఉన్నాడు. తను అక్కడ కాకుండా ఇంకో చోట కూచుంటే సరి అని అనుకుంటూ మరో సీట్లోకి వెళ్ళి కూచుంది. ఆ సీట్ ఎవరిదో వాళ్ళు వచ్చి అడిగితే - వాళ్ళని తన సీట్లోకి వెళ్లమందామనుకుంది.

అనసూయ కూచుని ఒక్క నిమిషం కూడా అవకుండానే- ఒక తెల్లవాడు అనసూయ దగ్గరికి వచ్చి ఏదో అన్నాడు.

అనసూయకి ఇంగ్లీష్ వచ్చు కానీ మాట్లాడ్డం అసలు అలవాటు లేదు. దానికి తోడు అడుగుతున్నది తెల్లవాడు. వాడి ఇంగ్లీష్ ఉచ్చారణ అసలు అర్థం కాలేదు అనసూయకి.

తను కూచున్న సీట్ వాడిది అయ్యుంటుందని అనుకుని బెరుకు పడుతూ, తడబడుతూ, తన అసలు సీట్ చూపించి అక్కడ కూచోమన్నట్లు గొణిగింది.

వాడు మళ్ళీ ఏదో అడిగాడు - ఈసారి కొంచెం గట్టిగా.

అనసూయకి చాలా భయం వేసింది. తన చేతిలో ఉన్న బేగే తనకి ఆసరా అన్నట్లు దాన్ని దగ్గరికి తీసుకుంది. తీసుకుని మళ్ళీ తన సీట్ వైపే చూపించింది. వాడు అటు చూడలేదు సరికదా, అనసూయ బేగ్‌ని తీసుకోబోయాడు.

అనసూయకి ఏం జరుగుతోందో అర్థం కాలేదు. వాడు దొంగ అయ్యుంటాడేమో అనుకుని, బేగ్‌ని ఇంకా దగ్గరికి తీసుకుంది.

వాడు వెంటనే జేబులోంచి సెల్ ఫోన్ తీసి ఎవరికో ఏదో చెప్పాడు.

క్షణాల్లో పోలీసుల్లాంటి వాళ్ళు నలుగురు అనసూయ సీట్ దగ్గరికి వచ్చేసారు.

వాళ్ళ చేతులకి గ్లవ్స్, మొహాలకి మాస్క్లు ఉన్నాయి.

అసలేమౌతోందో తెలియలేదు అనసూయకి.

అప్పుడు తన పక్క నుండి - "మీరు" అంటూ వినిపించింది.

తెలుగు మాట వినిపించగానే అనసూయకి ప్రాణం లేచొచ్చినట్లైంది.

"మీరు తెలుగు వాళ్ళా?" అని అడిగింది.

"అమ్మయ్య- మీరు తెలుగు వాళ్ళే కదా? మీ కట్టూబొట్టూ చూసి దక్షిణ భారతదేశం వాళ్ళే అయ్యుంటారని అనుకున్నాను కానీ తెలుగువాళ్ళో కాదో తెలియలేదు. ఏ అరవ వాళ్ళో అయ్యుంటే కష్టం అయ్యేది- నాకు అరవం రాదు"

అతను అలా మాట్లాడుతోంటే - ఆ తెల్లవాడు అతనితో ఏదో అన్నాడు.


అందుకు సమాధానంగా అతను "నేను ఆవిడని కనుక్కుని చెప్తాను ఉండండి" అని అన్నాడు. అతని ఇంగ్లీష్ అనసూయకి అర్థం అయింది. వెంటనే తనకి తన సీట్లో కూచుందుకు భయంగా ఉందనీ, అందుకని ఇలా ఈ సీట్లో వచ్చి కూచున్నాననీ, కావల్సి వస్తే ఆ తెల్లవాణ్ణి తన సీట్లో కూచోమనీ చెప్పింది.

అంతా విని "ఈ తెల్లవాడు మీరనుకుంటున్నట్లు ప్రయాణీకుడు కాదు - సెక్యూరిటీ ఆఫీసర్" అని అనసూయతో తెలుగులో అని, అనసూయ చెప్పిందంతా తెల్లవాడికి వివరంగా ఇంగ్లీష్‌లో చెప్పాడు అతను. వాడు మళ్ళీ ఏదో అన్నాడు. అతను ఎంతో నిదానంగా "మీరు పొరపాటు పడుతున్నారు. ఆవిడ

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

బేగ్‌లో అనుమానించదగ్గవి ఏవీ ఉండవు. కావల్సి వస్తే చూసుకోండి" అని తెల్లవాడితో అని "మీ బేగ్‌ని వాళ్ళకి ఇవ్వండి" అని అనసూయతో అన్నాడు.

అనసూయ తెల్లవాడికి బేగ్ ఇచ్చింది. వాడు దాన్ని మాస్కుల్లో ఉన్న నలుగురిలో ఒకళ్ళకి ఇచ్చాడు. వాడు దాన్ని వెతకడం మొదలెట్టాడు. అదీ ఎంతో జాగ్రత్తగా, భయంగా, అందులో ఏదో ఉన్నట్లుగా.



అప్పటికే చుట్టుపక్కల సీట్ల వాళ్ళు అక్కడేం జరుగుతోందా అని చూస్తున్నారు.

అనసూయకి ఎంతో అవమానంగా అనిపించింది. తనెవరు అనుకుని తన బేగ్‌ని చెక్ చేస్తున్నారు వీళ్ళు? అదీ ఇంతమంది మధ్యలో. తనను దొంగ అనుకుంటున్నారా? టెర్రరిస్ట్ అనుకుంటున్నారా? ఇంత అవమానం పుట్టిబుద్ధెరిగి ఎప్పుడూ అవలేదు అనసూయకి.

ఈలోగా తెల్లవాడు అనసూయకి సహాయం చేస్తున్న తెలుగతన్ని ఏదో అడిగాడు. అతను తన జేబులోంచి తన పాస్‌పోర్ట్ తీసి ఇచ్చాడు. ఇచ్చి-

"మీరు నన్నూ ఆవిడనీ ఒక ముఠా అనుకుంటున్నారు. అసలు నాకూ ఆవిడకీ ఏ సంబంధమూ లేదు. మా ఇద్దరిదీ ఒకటే భాష. అందుకే ఆవిడకి సాయం చేస్తున్నాను" అని అన్నాడు.

అనసూయ బేగ్‌ని చెక్ చేసిన వాడికి అందులో పాస్‌పోర్ట్, టిక్కెట్, కొంత డబ్బూ తప్ప ఇంకేం కనిపించలేదు. ఎందరో ఎన్నో జాగ్రత్తలు చెప్పడంతో ఆఖరికి కుంకుమ కూడా బేగ్‌లో పెట్టుకోలేదు అనసూయ.

అనసూయ పాస్‌పోర్టునీ, ఆ తెలుగతని పాస్‌పోర్టుని పరిశీలించి, రెండింట్లోని వివరాల్ని విడిగా రాసుకుని, ఆ పాస్‌పోర్టులతో పాటు అనసూయ బేగ్‌ని వెనక్కి ఇచ్చేసి - అనసూయకి కానీ, అతనికి కానీ - సారీ కూడా చెప్పకుండా వెళ్ళిపోయారు వాళ్ళు.

"మీరు నా సీట్లో కూచోండి. నా పక్క సీట్లో నా భార్యే కూచుంది. మీకు తోడుగా ఉంటుంది. నేను మీ సీట్లో కూచుంటాను" అని అనసూయని తన భార్య పక్కన కూచోపెట్టి అతను అనసూయ సీట్లోకి వెళ్ళిపోయాడు.

"మీరు మీ సీట్లో కాకుండా ఇంకో సీట్లో కూచున్నారు కదా. అందుకని వాళ్ళకి అనుమానం వచ్చింది" అని అంది ఆ అమ్మాయి.

"నేను సీట్ మారిన సంగతి వాళ్ళకెలా తెలిసింది? ఐనా అందులో తప్పేముంది?" అని అడిగింది అనసూయ.

"ఇప్పుడు ప్రపంచం అంతా భయం నీడలోనే కదా బతుకుతోంది. అందులోనూ లండన్‌లాంటి చోట్ల- విమానాశ్రయాల్లోనూ, విమానాల్లోనూ టెర్రరిస్టుల భయం ఎక్కువ. దాంతో భద్రత అవసరం ఎక్కువ. అందుకే సెక్యూరిటీ వాళ్ళు నిరంతరం చూసుకుంటూనే ఉంటారు"

"ఇంకో సీట్లో కూచుంటే అనుమాన పడాల్సింది ఏముంది?"

"ఒకటి మీరు సీట్ మారారు. ఇంకోటి మీ

మొహం ఆందోళనగా ఉంది"

"అవును. నాకు భయంగా ఉంది"

"అది కరెక్టే- ఐతే ఎవరన్నా కంగారుగా, ఆందోళనగా ఉంటే - వాళ్ళకి అనుమానం. ఏదో చేద్దామనుకున్న వాళ్ళే అలా ఉంటారని వాళ్ళ ఆలోచన."

"సెప్టెంబర్ తొమ్మిది తర్వాత అమెరికాలో కూడా చాలామంది విమానం ఎక్కుతూ భయపడుతున్నారుటగా. కొందరైతే మందులు కూడా వేసుకుంటున్నారుట. అలా చాలామంది భయపడుతూ కనిపిస్తోంటే - నన్నే ఎందుకు పట్టుకున్నారు?"

"మీరు భారతదేశం నుండి వస్తున్నారు కదా?"

"ఐతే- మనది టెర్రరిస్ట్ దేశం కాదు కదా- వాళ్ళు భయపడ్డానికి అదే ఏ... " అంటూ చుట్టూ చూస్తూ ఆగింది అనసూయ.

అనసూయ ఏం చెప్పబోతూ ఆగిందో అర్థం అయినట్లు "వీళ్ళకి ఆసియా దేశాలన్నీ ఒకటే. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఇండియా- ఏ దేశం వాళ్ళైనా ప్రమాదం అని వీళ్ళ ఆలోచన. అందుకే మనల్ని చూస్తే వీళ్ళకి అనుమానం. మనలో ఎవరిని చూసినా వీళ్ళకి టెర్రరిజమే కనిపిస్తుంది"


"నన్ను చూస్తేనా? అరవై ఏళ్ళు దగ్గర పడుతున్నాయి నాకు. అందులోనూ ఆడదాన్ని, నన్ను టెర్రరిస్టని ఎలా అనుకుంటున్నారు వీళ్ళు?"

"వయస్సులో చిన్నవాళ్ళనీ మగవాళ్ళని ఎలానూ అనుమానిస్తారు. అందుకని అలాంటివాళ్ళు మీలాంటి వాళ్ళ ద్వారా పనులు చేయించుకుంటారని వాళ్ళ భయం అయ్యుంటుంది"

"నా బొట్టూ కట్టూ చూస్తే తెలియడం లేదా వీళ్ళకి - పూజా పునస్కారాలూ తప్ప ఇంకేం తెలియని దాన్నని"

"ఆ విషయం మనకి తెలుస్తుంది. వాళ్ళకి కాదు. అంతే కాదు. ఆ కట్టూ బొట్టే వీళ్ళలో అనుమానం కలిగిస్తుంది. అదే మీరు కూడా నాలా పేంటూ షర్టూ వేసుకునుంటే... " అని ఆగింది ఆ అమ్మాయి.

"వాళ్ళు ఏ ఆఫ్ఘనిస్తాన్ వాళ్ళ గురించో, పాకిస్తాన్ వాళ్ళ గురించో అనుకుంటే సరే మన గురించి - మన భారతీయుల గురించి - అనుకోడం" అని అనసూయ ఇంకా ఏదో అనబోతోంటే, ఆపి ఆ అమ్మాయి-




"మన దేశంలోనూ అంతేగా.. ముస్లిం ఐన ప్రతి ఒక్కరినీ అనుమానంగా చూస్తారుగా" అంది.

అనసూయకి గట్టిగా చెంపమీద కొట్టినట్లైంది. తన పక్కన కూచున్న ముస్లింని తను అనుమానించింది. పాపం అతను కూడా తనలాగే మంచివాడే అయ్యుండవచ్చు. అతన్ని ఒక మనిషిలా కాకుండా ఓ ముస్లింలా చూసి భయపడింది తను. తన చేతిలో అధికారం లేదు కాబట్టి అతన్నేమీ చెయ్యలేకపోయింది కానీ ఉండి ఉంటే ఇలానే అవమానించేదేమో.

ఆ అమ్మాయే మళ్ళీ అంది.


"టెర్రరిజం ప్రపంచంలో అన్ని చోట్లా వ్యాపిస్తోంది. టెర్రరిస్టుల బాంబు దాడుల్లో కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇంకొందరు గాయపడుతున్నారు. టెర్రరిస్టుల చేత చంపబడుతున్న మనుషులు కొందరైతే చావు భయంతో బతుకుతున్న మనుషులు చాలామంది. టెర్రరిస్టులు మనుషుల కన్నా ముఖ్యంగా మనుషుల ధైర్యాన్ని చంపేస్తున్నారు. నమ్మకాన్ని చంపేస్తున్నారు. ఒకవేళ వాళ్ళు సాధించదలచుకున్నది అదే ఐతే - వాళ్ళు సాధించదలచుకున్నది వాళ్ళు సాధిస్తున్నట్లే"

తను ఎక్కువ మాట్లాడానని అనుకుందేమో - ఆ అమ్మాయి మాట్లాడ్డం ఆపేసింది.

జరిగిన సంఘటనలు జీర్ణించుకోవడానికి అన్నట్లు అనసూయ కళ్ళు మూసుకుని కూచుంది.

## డైరెక్షన్ చేస్తా

నేపాలీ భామ మనీషా కొయిరాలా ఈమధ్య స్టార్‌రేస్‌లో బాగా వెనకబడినా ఇప్పుడిప్పుడే మళ్లీ పుంజుకుంటోంది. అయితే నటనకు అవకాశం వుండే పాత్రల్నే పోషించాలనుకుని వాటినే అంగీకరిస్తున్న మనీషా- అసలు ఇప్పుడు నటన అంటే ఎంతో ఆసక్తి కలుగుతోంది. వాస్తవానికి దగ్గరగా వుండే పాత్రల్ని పోషించడం నిజంగా అదృష్టం అంటోంది. అంతేకాదు, భవిష్యత్తులో తగిన అవకాశం గనక వస్తే దర్శకత్వం వహిస్తానంటోంది మనీషా.



తనకి సాయం చేసిన అతనికి కృతజ్ఞతలు చెప్పలేదని గుర్తొచ్చింది.

"మీ ఆయన నాకు చేసిన సాయానికి నేను థేంక్స్ చెప్పనేలేదు. ఇది థేంక్స్ చెప్పి తీర్చుకునే ఋణం కాదనుకో. ఐనా నా తృప్తికోసం ఇంతకీ మీ పేర్లేంటి?" అని అడిగింది అనసూయ.

"ఆయన పేరు మొహమ్మద్ ఖాన్, నా పేరు జరీనా ఖాన్" అంది ఆ అమ్మాయి.

"అంటే మీరు..." ఇంకేం అడగాలో తెలియనట్లు ఆగిపోయింది అనసూయ.

అవునన్నట్లు సన్నగా నవ్వింది జరీనా.